
జనగామ
ఆదివారం 26 నవంబర్ 2023



# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







# ఆ పాలనలో కాళరాత్రులే

## కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

ఏనాడూ ప్రజల బాగోగుల గురించి ఆలోచించని కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడేనని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాము పాత రోజులను కోరుకోవడం లేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఇలానే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, తమ మంచిచెడ్డల గురించి ఆలోచించే గులాబీ పార్టీ వెంటే ఉంటామని రైతులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రోజులు ఇంకా గుర్తున్నాయని, కరెంటు లేక, నీళ్లు లేక ఎవుసం సాగక ఏడ్చామని, ఇప్పుడు వచ్చి అదిచేస్తాం.. ఇదిచేస్తామని అసలు ఎవుసం గురించి తెల్వనోళ్లు మాట్లాడుతున్నారని, ఎవుసానికి మూడుగంటల కరెంటు ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. ధరణిని తీసేస్తామంటే ఊరుకునేది లేదని, మళ్లీ భూముల పంచాయితీలు తేవద్దని తెగేసి చెబుతున్నారు. ఎన్నో ఏండ్లు పరిష్కారానికి నోచని సమస్యలు కూడా ధరణితో తీరాయని, ఇప్పుడిప్పుడూ భూముల కొట్లాటలు తగ్గుతున్నాయని, మళ్లీ దళారుల రాజ్యం రావద్దని అంటున్నారు. రైతులకు ఏంకావాల్నో తెలిసిన కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆగంజేసే కాంగ్రెస్ వద్దని ముక్తకంఠంతో చెబుతున్నారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 25**

### నాటి చీకటి రోజులు మళ్లీ రావద్దు

- కరెంటు లేని ఎవుసం చేయలేం
- రైతులను ఆగంజెయ్యాలని చూస్తున్నరు
- భూములను కాజేయాలని పన్నాగం పన్నుతున్నరు
- 'హస్తం' పార్టీపై రైతులు, ప్రజల మండిపాటు
- బీఆర్‌ఎస్ పాలనే బాగుందంటూ కితాబు
- కంటికిరెప్పలా కాపాడుకునే కేసీఆర్‌కే మద్దతు అంటూ స్పష్టం



## పాడుకాలం.. మళ్లీ రావొద్దు

లింగాలఘనపురం, నవంబర్ 25 : మాకు కుందారంలో పొత్తుల బావి ఉంది.. కోతల కరెంట్‌తో బాయికాడ మోటరు వంతుల వారీగా పెట్టుకోవాల్సి వచ్చేది. దినం విడిచి ఒకరోజు మాకు వంతు వచ్చేది.. రాత్రిపూట కరెంట్ కోసం నా పెనిమిటి పడిగాపులు పడేవాడు.. పురుగుపుట్రా భయంతో ఆయన ఇంటికి వచ్చేంతవరకూ బిక్కుబిక్కు మంటూ భయపడేదాన్ని.. గీ పదేళ్లనుంచి కరెంట్ సమస్యలేకుండా కంటినిండా నిద్రపోతున్న.. పాడు కాంగ్రెస్ కాలం అస్సలు రావద్దు. ఆ..మా..దేవుడు సీఎం కేసీఆర్ సల్లంగుండ. మళ్లీ ఆయనే పాలన చేయాలె.

**-లొక్కుంట్ల రమ, రైతు, కుందారం**



## 24 గంటల కరెంట్‌తోనే మేలు..

దేవరుప్పుల, నవంబర్ 25 : కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంటుతోని సకల జనులు బతుకుతున్నరు. ఒక్క రైతులే కాదు వ్యవసాయం మీద ఆధారపడిన అనేక మందికి ఉపయోగకరంగా ఉంది. కాంగ్రెస్ గవర్నమెంట్‌ల 6గంటల కరెంటు అదీ పొద్దున మూడు గంటలు, రాత్రి మూడు గంటలు ఇచ్చేది. ఎప్పుడు పోతదో ఎప్పుడు వస్తదో తెలువదు. తెల్లందాక నిద్ర ఉండకపోయేది. ఉండిలేని నీళ్లకు కరెంటు లేక గోస పడేది. ఈ తిప్పలు పోయి కేసీఆర్ పాలనలో 24గంటల కరెంటు, బోర్ల నిండ నీళ్లు ఉంటున్నయ్. పొద్దుందాక కరెంటు సరిపోతుంది. తేళ్లు పాములు కుట్టే బాధ తప్పింది. రైతులు రాజుల తీరుగ బతుకుతున్నరు. మళ్లీ మాయదారి కాంగ్రెసోళ్లు సొల్లుమాటలు మాట్లాడుతున్నరు. వాళ్లు దండుగ మారోళ్లు. రైతులంతా గులాబీ రంగుతోని ఉన్నరు. కాంగ్రెస్‌కు ఓటేసుడు ఎందుకు..తిప్పలు పడుడెందుకు. వాళ్లకు ఓట్లతోని సమాధానం చెబుతరు.

**-అజ్మీరా శాంక్రూనాయక్, మొండిచింత తండా**

## రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులకు కష్టాలే..

జఫర్‌గడ్, నవంబర్ 25 : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కరెంట్‌పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నడు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవ్.. కాంగ్రెస్ నాయకులకు 10 హెచ్‌పీ మోటర్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు. కాంగ్రెసోళ్లు రైతులకు 3 గంటల కరెంట్ సరి పోతుందని ప్రకటనలు చేస్తున్నరు. 10 హెచ్‌పీ మోటర్లపై, రైతుల వ్యవసాయానికి ఎంత కరెంట్ సరిపోతదో తెలియని, అవగాహన లేని కాంగ్రెసోళ్లు ఇక రైతులను ఏ విధంగా ఆదుకుంటరో రైతులకు అర్థమైంది. తెలంగాణ రాక ముందు 2014కు ముందు కాంగ్రెస్ హయాంలో కరెంట్ సక్రమంగా రాక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోయి మోటర్లు ఎక్కువగా కాలి పోయేవి. రైతులు కాలి పోయిన మోటర్లను షాపు దగ్గర రిపేర్ చేసేందుకు రోజుల తరబడి వేచి చూసే వారు. కానీ, 2014 తర్వాత తెలంగాణ సర్కార్ హయాంలో కరెంట్ కష్టాలు తీరి పోవడంతో మోటర్లు కాలిపోవడం లేదు. ఇది వాస్తవం.. కాంగ్రెస్ నేత 3 గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నడు. 3 గంటల కరెంట్ నారు మడి పారేందుకు కూడా సరి పోదు.. మాయ మాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్న కాంగ్రెస్‌కు రైతులు ఓట్లతోనే బుద్ధి చెప్తరు. 24 గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ సర్కార్‌నే తిరిగి ఎన్నుకుంటాం.

**-భూక్యా తిరుపతి, కేజీ తండా, జఫర్‌గఢ్ మండలం**



## కాంగ్రెస్‌కు రైతుల సమస్యలు పట్టవు..

స్టేషన్ ఘన్‌పూర్ : గత ప్రభుత్వాల పాలనలో సాగునీరు లేక, కరెంట్ సరిగా రాక పంటలు ఎండిపోయి రైతులు అప్పుల్లో కూరుకపొయ్యారు. ప్రతి సారి పెట్టుబడులకు తెచ్చిన అప్పు తీరక పోగా, అసలుకు సమానంగా మిత్తి అయ్యేది. అప్పుల బాధలు తట్టుకోలేక, ఉన్న భూమిని అమ్మదామంటే కొనేవారు ఉండే వారు కాదు. దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. అంతే కాకండా రాత్రి పూట పొలానికి నీళ్లు పెట్టడానికి పోయి పాములు, తేళ్లు కాటుకు గుర్రై, కరెంట్ షాక్‌తో రైతులు చనిపొయ్యేటోళ్లు. కానీ, తెలంగాణ వచ్చాక కరెంట్ సమస్య, సాగునీటి సమస్య పోయి రైతులు నేడు సంతోషంగా జీవిస్తున్నరు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్, సాగునీరు అందించి కేసీఆర్ రైతుల ఇంట్లో వెలుగులు నింపుతుంటే, మూడు గంటల కరెంట్ ఇచ్చి రైతుల తలాపున దీపం పెట్టాలని కాంగ్రెస్ చూస్తుంది. రైతులను సంపే ప్రభుత్వం కావాలని ఏ రైతు కోరుకోడు. రైతులకు అండగా ఉంటూ, ఆత్మ స్థైర్యాన్ని ఇస్తున్న కారు గుర్తుకు ఓటు వేయాలని రైతులు ఎప్పుడో నిర్ణయించుకున్నరు.

**-ఆకుల కృష్ణంరాజు, రైతు, తానేదార్‌పల్లి**



## రాత్రి కరెంట్‌తో ఆగమైంది చాలు..

చిల్పూరు, నవంబర్ 25 : కాంగ్రెస్ హయాంలో కరెంట్ సరఫరా సక్రమంగా రాక అర్ధరాత్రి 12 గంటల వరకు కూలీలను పెట్టుకొని ఎదురుచూసి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు సీఎం కేసీఆర్ హయాంలో 24 గంటల ఫ్రీ కరెంట్‌తో కష్టాలు పూర్తిగా తొలిగిపోయి సంతోషంగా ఉన్నం. ఎవరూ ఎన్ని చెప్పినా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు పోయి.. రైతులకు నాయ్యం జరిగింది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ చాలంటున్నరు. గిట్లయితే మల్లా పాత రోజులే అత్తయ్. ఎవుసం తెలిసినోడు గిట్ల మాట్లాడడు.. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలె.

**-బలత్తుల యాదగిరి, రైతు, మల్కాపూర్**



## 3 గంటల కరెంట్‌తోని పొలాలకు నీళ్లెట్ల పారుతయ్?

వేలేరు, నవంబర్ 25 : తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో భూములన్నీ పచ్చని పైరులా మారిపోయినయ్. మూడు గంటలే కరెంట్ ఇస్తే పచ్చని పంట పొలాలన్ని బీటలు వారి ఎండిపోతయ్.. మూడు గంటల కరెంట్‌తో కనీసం రోజుకి 20 గుంటల పొలం కూడా తడవదు. ఇప్పుడిప్పుడే వ్యవసాయ రంగంలో అనేక మార్పులు జరిగి అనేకమందికి ఉపాధి దొరుకుతంది. వలసలు తగ్గిపోయినయ్. రైతులు కొంతమేర అభివృద్ధి సాధిస్తున్నరు. రైతలుకు అన్యాయం జరిగేలా తెలంగాణలో మళ్లీ మూడు గంటల కరెంట్ ఇస్తామంటే రైతులు మళ్లీ ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సిందే. మూడు గంటల కరెంట్ ఇస్తామన్న కాంగ్రెసోళ్లను వలస పంపియ్యాలే. తెలంగాణలో వరి ధాన్యం పంటలు పండించాలంటే ఖచ్చితంగా 24గంటల కరెంట్ ఉండాల్సిందే.

**- దొంత లక్ష్మీనారాయణ, రైతు, వేలేరు**



## కాంగ్రెస్‌కు ఓటేస్తే బతుకు దెరువుకు పోతది

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 25 : తెలంగాణ రాకముందు ఒక వైపు కరువుతో, మరోవైపు కరెంట్ కష్టాలతో వ్యవసాయం చేయలేక ఇంట్లో తిండికి ఎళ్లక, పొట్ట చేత పట్టుకుని బతుకు దెరువు కోసం కుటుంబమంతా పట్నం వైపు పోయి పండుగకు, పబ్బాలకు ఇంటికి తిరిగి వచ్చిన రైతుపై ఉన్న భూమి ఇంకొక్కరి పేరుపైకి మారేది. ఊళ్లో పైరవీ కారులు, దళారులు, పైసలు ఉన్నోళ్లు కొందరు వీఆర్వోలకు పైసలు ఇచ్చి ఇతరుల భూములను తమ పేరుపై మార్చుకునేది. దీంతో రైతు తనకు భూమి ఉందన్న ధైర్యాన్ని కోల్పోయి, రెవెన్యూ ఆఫీస్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరగలేక ఆత్మహత్యలు చేసుకునేటోళ్లు. కానీ, కేసీఆర్ ధరణి తీసుకొచ్చి తమ భూములు తమకు తెల్వకుండా ఇతరులకు మారవనే ధైర్యాన్ని ఇచ్చిండ్రు. రైతు వేలు ముద్ర పెట్టందే ఎన్నేండ్లు అయినా తన భూమి తనకే ఉంటది. ధరణితో నష్టాలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తూ, అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తామని అంటుంది. ఏమిలేని కాంగ్రెస్ నాయకులకు అప్పనంగా రైతులకు భూములు కట్టపెట్టడానికే ధరణి తీసివేస్తామంటుంది కావొచ్చు. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా రైతులందరూ కేసీఆర్ వెంటే, రైతుల ఓట్లన్నీ కారుకే.

**-సట్ల, దేవేందర్ గౌడ్, రైతు, రంగరాయగూడం**



## ధరణితో రిజిస్ట్రేషన్ సులభమైంది



జఫర్‌గఢ్, నవంబర్ 25 : వ్యవసాయ భూముల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు ధరణి పోర్టల్‌తో తహసీల్దార్ కార్యాలయంలోనే సులభతరంగా పూర్తవుతున్నయ్. క్షణాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి కాగానే అమ్మిన వ్యక్తి పట్టాదారు పాసు పుస్తకం ఖాతా నుంచి విస్తీర్ణం తొలిగి, కొన్నవారి ఖాతాలోకి చేరుతోంది. గతంలో ధరణి పోర్టల్ లేక పోవడంతో భూ రిజిస్ట్రేషన్ల కోసం రిజిస్ట్రేషన్ ఆఫీసుల చుట్టూ తిరిగి రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డాం. పైరవీదారులకు ఎంతో డబ్బు ఖర్చు పెట్టుకున్నా.. పనులు జరిగేవి కావు. భూ సంస్కరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్‌తో ఎన్నో భూ సమస్యలు పరిష్కారం కావడంతో పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరంగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్ వల్లే త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ముగుస్తున్నయ్. ధరణి పోర్టల్‌పై కాంగ్రెస్ చేస్తున్న చెడు ప్రచారాన్ని రైతులు ఖండిస్తున్నం. ధరణి వద్దంటున్న కాంగ్రెస్‌ను రైతులు బంగాళఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నం. భూ సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

**-కుల్లా రాజు, వడ్డెగూడెం, జఫర్‌గఢ్ మండలం**






## 'ధరణి'ని తీసేస్తే దళారులదే రాజ్యం..

లింగాలఘనపురం, నవంబర్ 25 : ధరణిని తొలగిస్తే.. పైరవీకారులే రాజ్యమేలుతరు.. నేను కొత్తపెల్లిలో నాపక్కరైతు దగ్గర పదేళ్ల క్రితం అర ఎకరం పొలం కొన్నా.. నాకు వీలైనప్పుడల్లా ఆ భూమిని విక్రయించిన వారికి అనుకున్న ధర చెల్లించా.. జనగామలోని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లగానే ఇదిలేదూ.. అది లేదూ అంటూ పేచీలు పెట్టారు. కొంత మంది పైరవీకారులు నాదగ్గరకు వచ్చి ఎందుకు ఆగమవుతున్నవ్.. ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తం.. మాకు కర్చులకు డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశారు. ధరణి వచ్చాక నేనే.. ఆ రైతు నేరుగా మీ సేవ కేంద్రానికి వెళ్లాం.. ఫీజు చెల్లించాం.. మరునాడు స్లాట్ బుక్ అయింది. మేమిద్దరం.. మరో ఇద్దరిని సాక్షులుగా తీసుకెళ్లాం.. 5 నిముశాల్లో తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి, అదే సమయంలో ఆ అరెకరం నా పాస్ పుస్తకంలో నమోదు చేసి, ఆ రైతు పాస్ పుస్తకంలో అరెకరం తొలగించారు. ఇంత మంచిగా ధరణి నడుస్తుంటే. రైతులు దర్జాగా యాజమాన్య హక్కులు పొందుంటే ఈ వ్యవస్థను రద్దుచేస్తాం అంటున్న కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం. మేమే కాదు రైతులంతా బీఆర్‌ఎస్‌నే గెలిపిస్తరు.

**-తుంగ వెంకటేశ్, రైతు, కొత్తపెల్లి**

## ధరణి లేకుంటే భూ రికార్డులు గల్లంతే



వేలేరు, నవంబర్ 25 : ధరణి లేకపోతే భూరికార్డులు గల్లంతే. ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెసోళ్లతో రైతులకు తీవ్ర అన్యాయమే జరుగుతది. ధరణితో అసలు పట్టాదారులు లబ్ధిపొందుతున్నరు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతుభీమా పథకాలు అసలైన రైతులకు సక్రమంగా చేరుతున్నాయ్. ధరణిని రద్దు చేసి భూ రికార్డుల్లో పాత వివరాలను పొందుపర్చితే అసలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందవు. పట్టాదారులకు, కౌలుదారులకు మధ్య విబేధాలు ఏర్పడి పథకాలు అర్హులకు అందవు. తెలంగాణలో ధరణి పోర్టల్ ద్వారా భూ సమస్యలు లేకుండా సజావుగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నయ్. ధరణిలో నమోదై ఉన్న రైతులకే ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతుబంధు డబ్బులు సక్రమంగా అందుతున్నయ్. రైతులకు భూ సమస్యలు లేకుండా ఉండాలంటే ధరణిని కొనసాగించాల్సిందే.

**- వడ్లకొండ రమేశ్, వేలేరు**

